బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి


బీఆర్ఎస్ నేతలతో సమావేశమైన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్: చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపునకు కృషి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శంషాబాద్ బీఆర్ఎస్ నేతలతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం కాసాని జ్ఞానేశ్వర్ పార్టీ నేతలను కలుస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆర్. గణేశ్‌గుప్తా, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్, జెడ్పీటీసీ నీరటి తన్వి, పట్టణాధ్యక్షుడు డి.వెంకటేశ్‌గౌడ్, మండలాధ్యక్షుడు కె. చంద్రారెడ్డి, కౌన్సిలర్లు మేకల వెంకటేశ్, జహంగీర్‌ఖాన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం పనులు త్వరగా పూర్తి చేయాలి


స్టేడియం పనులను పరిశీలిస్తున్న వైస్ చైర్మన్, డీఈలు

మణికొండ: స్టేడియం పనులు త్వరగా పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి సూచించారు. మున్సిపాలిటీ కేంద్రం ల్యాంకోహిల్స్ పక్కన నిర్మిస్తున్న స్టేడియం పనులను డీఈ దివ్యజ్యోతితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియం లెవలింగ్ పనులకే ఎక్కువ సమయం తీసుకున్నారని, ఇకనైనా గ్యాలరీ, గ్రౌండ్, తదితర పనులు వేగవంతం చేయాలన్నారు. ఆలస్యం చేస్తే కాంట్రాక్టర్‌కు జరిమానా విధించాలని అప్పుడే ప్రజలకు సకాలంలో అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో నవజ్యోతి యువజన సంఘం అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, నాయకులు వి. అరవింద్, ఎం. రామకృష్ణారెడ్డి, శరత్, చందు, సునీల్‌రెడ్డి, కాంట్రాక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు


జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తున్న నాయకులు


రంజిత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

మణికొండ: బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డిని పలువురు నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు డాక్టర్ ప్రభావతి, తిరుమల హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాంతారావు, సెక్రటేరియట్ కాలనీ సంఘం సంయుక్త కార్యదర్శి శివరామకృష్ణ రంజిత్ రెడ్డిని కలిసి సన్మానించారు. వచ్చే ఎన్నికల్లోనూ గెలిచి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు.

జ్ఞానేశ్వర్‌ను కలిసిన నాయకులు..

మణికొండ: రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన జ్ఞానేశ్వర్‌ను కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన నాయకులు బి.అరుణ్‌కుమార్, కె.సాయి యాదవ్, శ్రీకాంత్ యాదవ్, ఎం. కిశోర్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సుభిక్షం..

బండ్లగూడ: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలంతా సుభిక్షంగా ఉంటారని తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. కిస్మత్‌పూర్ నాయకులు మంగళవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసే ప్రతిఒక్కరికీ గుర్తింపు ఇస్తూ పదవులు అప్పగిస్తున్నారన్నారు. సమష్టిగా పని చేస్తూ పార్టీని మరింత ముందుకు తీసుకువెళ్దామన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, లంకల సంగారెడ్డి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డిని..

మణికొండ: రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియామకమైన డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.జితేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, నాయకులు రాజు, శ్రీనివాస్‌చారి, షేక్ హాజీ, శ్రీనివాస్‌రెడ్డి, శరత్, కె.శ్రావణ్, జగదీశ్వర్, షానవాజ్, ఇనాయత్ తదితరులు పాల్గొన్నారు.

జయంతి వేడుకలకు ఆహ్వానం


సబితా ఇంద్రారెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

రాజేంద్రనగర్: ఏప్రిల్ 5న నిర్వహించనున్న బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలకు హాజరు కావాలని రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎంపీ రంజిత్ రెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని వారి నివాసంలో మంగళవారం కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, కోశాధికారి రగడంపల్లి శ్రావణ్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు పోయిల జీవన్ దాస్, మాజీ అధ్యక్షుడు టి.ఆర్. శ్రీరాములు, గోల్కొండ రాజు కుమార్, పంబాల రాజు, పలుగుచెరువు మహేశ్, బాబురావు, ప్రీతం రాజ్, జాన్‌పాల్, బచ్చల మహేశ్, దాసరి రమేశ్, జంగయ్య, గోల్కొండ ఉపేందర్, బర్ల సుమన్, ఎడ్లకాడి చంద్రశేఖర్, గౌతమ్, లక్ష్మి, రమేశ్ గుంటి, బెంజిమన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన రంగంలో అద్భుత ఆవిష్కరణలు

ప్రముఖ పేటెంట్ నిపుణుడు సుభాజిత్ సాహా


సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్లు, విద్యార్థులు

ఏజీవర్సిటీ: ఉద్యాన రంగంలో అద్భుత ఆవిష్కరణలు జరుగుతున్నాయని వాటిని మేథో సంపత్తి హక్కులుగా మార్చుకుంటే అధిక ఆదాయం పొందవచ్చని ప్రముఖ పేటెంట్ నిపుణుడు రిజల్యూట్ గ్రేప్ ఐపీ సంస్థ హెడ్ సుభాజిత్ సాహా అన్నారు. రాజేంద్రనగర్‌లోని ఉద్యాన కళాశాలలో తెలంగాణలో ఉద్యాన రంగంలో వాణిజ్య సంబంధిత మేథో సంపత్తి హక్కులపై ఉద్యాన విశ్వవిద్యాలయం, తెలంగాణ రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ సంయుక్తంగా మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యానరంగంలో భౌగోళిక గుర్తింపు పొందిన ఉత్పత్తుల పంటల్లో రైతులు 20 నుంచి 30 శాతం అధిక లాభాలు, మార్కెట్ ధర పొందుతున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయాలు, రైతులు ప్రభుత్వం కలిసికట్టుగా ముందుకు వస్తే రాష్ట్రం నుంచి అనేక ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు తేవచ్చు అని పేర్కొన్నారు. భౌగోళిక గుర్తింపు పొందిన ఉత్పత్తులు ఉన్న ప్రదేశాల్లో పర్యాటకానికి కూడా అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్ లక్క గాజులు, పోచంపల్లి చీరలు, బనగానపల్లి మామిడి కాయలు, హైదరాబాద్ హలీం అంటే ప్రత్యేకమైనవిగా భౌగోళిక గుర్తింపు సాధించాయని వివరించారు. రాష్ట్రంలో 16 వస్తువులకు భౌగోళిక గుర్తింపు వచ్చిందని, త్వరలో మరొక దానికి కూడా గుర్తింపు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వర్సిటీ డీన్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ పరిశోధనలో సృజనాత్మకత అంశాలు, రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాన్ని వెతికే దిశగా పరిశోధనలు చేయాలని సూచించారు. దేశ సంపద అయిన పసుపు, బాస్మతి, వేప ఉత్పత్తులు, వాటి ఔషధ గుణాలను విదేశీయులు దోచుకుపోతున్నారని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అందుకు మేథో సంపత్తి హక్కులు ఉపయోగపడుతాయని అన్నారు. ఐపీఆర్ సెల్ నోడల్ అధికారి డాక్టర్ పిడిగం సైదయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు హక్కుల కేంద్రాలుగా ఎదగాలని అలాగే దైనందిన జీవితంలో ప్రతి అంశం ఏదో ఒక మేథో సంపత్తి హక్కుతో ముడిపడి ఉందన్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రతి పరిశోధన అకడమిక్ అంశాల్లో పేటెంట్ కాపీరైట్ అంశాలను పరిశీలిస్తే పరిశోధకుల విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డీన్ ప్రశాంత్, దక్షిణ ప్రాంత మండలి హెడ్ సురేశ్‌కుమార్, మజ్జిగ శ్రీనివాస్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛభారత్'


పారిశుద్ధ్య పనుల్లో విద్యార్థులు, ఇన్‌చార్జిలు

ఏజీవర్సిటీ: ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు శంషాబాద్ మండల పరిధిలోని మల్కారం గ్రామంలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోడ్లు, పాఠశాల, పంచాయతీ, అంగన్‌వాడీలతో పాటు వీధుల్లోని చెత్తను తొలగించారు. పరిసరాలు శుభ్రంగా లేకుంటే అనారోగ్యం పాలవుతారని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ శిబిరం ఇన్‌చార్జిలు సంతోషిణి, లావణ్య విద్యార్థులు పాల్గొన్నారు.


పంపిణీ చేసిన పరీక్షాప్యాడ్‌లతో విద్యార్థులు


గ్రామంలోని రోడ్లను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

నేడు నీటి సరఫరాకు అంతరాయం

మణికొండ: సింగూరు ప్రాజెక్టు నుంచి ఖానాపూర్ రిజర్వాయర్‌కు నీటిని తరలించే పైప్‌లైన్లో పలు చోట్ల మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఈ నెల 20న (నేడు) ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నీటి సరఫరాను నిలిపివేస్తున్నామని జలమండలి అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట, కోకాపేట, నార్సింగి, ఖానాపూర్, మంచిరేవుల గ్రామాలు, మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ, మణికొండ, నెక్నాంపూర్ గ్రామాల పరిధిలో సరఫరా ఉండదని పేర్కొన్నారు. మరమ్మతులు పూర్తి కాగానే సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

భవనంపై నుంచి పడి యువకుడి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: భవనం పైనుంచి పడి యువకుడి మృతి చెందాడు. మైలార్‌దేవ్‌పల్లి ఎస్ఐ రజాక్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రామ్‌కుమార్ తన కుమారుడు కామేష్‌తో కలిసి (19) కాటేదాన్ ప్రాంతానికి రెండు నెలలల క్రితం వలస వచ్చాడు. ఇక్కడే ఓ భవన నిర్మాణంలో కూలీ పని చేస్తూ అందులోనే ఉంటున్నాడు. సోమవారం రాత్రి భవనం పై అంతస్తులో నిద్రిస్తున్నాడు. రాత్రి సమయంలో మూత్ర విసర్జన చేసేందుకు కిందకు దిగే క్రమంలో భవనం డక్ట్‌లో నుండి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం అందులో పనిచేసే వారు వచ్చి చూసే సరికి రక్తపు మడుగులో ఉన్న యువకుడిని చూసి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మనూ'లో సోషల్ వర్క్ డే

రాయదుర్గం: అట్టడుగువర్గాల స్థితిగతులను మెరుగుపర్చడంలో సామాజిక కార్యకర్తలు ముఖ్య భూమిక పోషిస్తున్నారని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎం.డి. షాహిద్ రజా పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సోషల్‌వర్క్ విభాగం ఆధ్వర్యంలో 'మనూ' సోషల్ వర్క్ క్లబ్ (ఎల్‌డబ్ల్యూసి) పర్యవేక్షణలో ప్రపంచ సామాజిక కార్య దినోత్సవాన్ని 'పరివర్తన మార్పు కోసం భాగస్వామ్య భవిష్యత్తు' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూసీ కార్యదర్శి మహ్మద్ ఆరిఫ్ మాట్లాడుతూ సోషల్ వర్క్ డే ప్రాముఖ్యత, చారిత్రక సందర్భం గురించి వివరించారు. అనంతరం నజీర్ కలీమ్, అబ్దుల్ మజీద్, హంజామన్నన్ చదివిన కవితలు అందరినీ ఆకట్టుకున్నాయి.

తేనెటీగల పెంపకంపై శిక్షణ


తేనె టీగల పెంపకం శిక్షణలో పాల్గొన్న రైతులు, అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో జిల్లాస్థాయి శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కూరగాయల పరిశోధనా స్థానం, తేనేటీగల అభివృద్ధి పథకం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో తేనేటీగల పెంపకంలో శాస్త్రీయంగా తీసుకోవాల్సిన చర్యలను అధికారులు వివరించారు. ఇందులో మంచి లాభాలు ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో పరిశోధనా సంచాలకులు డాక్టర్ కిరణ్‌కుమార్, జోనల్‌హెడ్ డాక్టర్ సురేశ్, అనితకుమారి, ఇందిరా, రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ నైపుణ్యంపై


చీఫ్‌గెస్ట్‌కు జ్ఞాపికను అందజేస్తున్న డీన్

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలలో ఫొటోగ్రఫీ నైపుణ్యంపై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవీ రవికుమార్ చీఫ్ గెస్ట్‌గా హాజరై విద్యార్థులకు ఫొటోగ్రఫీ అంశాలపై అవగాహన కల్పించారు. ఇది ఒక కళ అని ఇందులో పలు సన్నివేశాలను ఎలా కెమెరాలో బంధించాలని అనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ నరేంద్రరెడ్డి, కేబీ ఈశ్వరి, సవిత అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల ఎదుట ఏబీవీపీ ఆందోళన


పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

శంషాబాద్: నర్కూడ గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట ఏబీవీపీ నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా మధ్యాహ్నం సెలవు ఇవ్వకపోవడంతో పాటు వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించిన పుస్తకాలను తల్లిదండ్రులకు బలవంతంగా అంటగుడుతున్నారన్నారు. విద్యాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పాఠశాలలోని పుస్తకాలను ఎంఈవో కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్, శంషాబాద్ జిల్లా అధ్యక్షుడు చాకలి మహేశ్, ప్రదీప్, మణికంఠ, అఖిల్, మహిపాల్, చరణ్, చందు, తిరుపతి, శివ, పవన్, నవీన్, సాయి పాల్గొన్నారు.

'ఓజ్' సూపర్ యాప్ ఆవిష్కరణ

టీహబ్‌లో ఆవిష్కరించిన సెయింట్ వ్యవస్థాపకుడు బివిఆర్ మోహన్‌రెడ్డి, సినీ నటి పాయల్ రాజ్‌పుత్



గచ్చిబౌలి: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో 'ఓజ్' సూపర్ యాప్‌ను సెయింట్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, సినీ హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ ఆవిష్కరించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు మరో కొత్త యాప్ అందుబాటులోకి వచ్చింది. సెయింట్ చైర్మన్ బివిఆర్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ యూపీఐ, గ్రాసరీస్, మెడిసిన్, క్యాబ్, సోషల్ నెట్ వర్క్, ఫుడ్ డెలివరీ, హోటల్స్, ట్రావెల్స్, మూవీ తదితర సేవలందించేందుకు ఒకే యాప్‌లో అందుబాటులోకి తేవడం ఆనందదాయకమన్నారు. ఈ యాప్ ద్వారా తక్కువ ధరలకే అందుబాటులోకి వస్తాయన్నారు.సినీనటి పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ విదేశాల్లో ఇలాంటి యాప్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. మనదేశంలో మొదటిసారిగా అన్ని రకాల సేవలు అందించే ఓజ్‌యాప్‌ను తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సినీ నిర్మాత మియాల రవీందర్‌రెడ్డి, యాప్ వ్యవస్థాపకులు సందీప్ వంగల, మానస చాగంటి, చందు వంగళూరితో పాటు నిర్వాహకులు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంకు వద్ద కారులో మంటలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి గుల్‌మొహర్‌పార్కు కాలనీ వద్ద ఉన్న పెట్రోల్ పంపు వద్ద ఓ కారులో మంటలు వ్యాపించాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వైపు వెళ్తున్న ఇండికా కారు గుల్‌మొహర్‌పార్కు కాలనీ సమీపంలోని ఎల్ ప్యూయల్స్‌లోకి వెళ్లే మార్గం వద్దకు రాగానే కారులో పొగలు వ్యాపించడంతో కారులోని వారు కిందకు దిగారు. పెట్రోల్ బంకు సిబ్బంది అక్కడికి చేరుకొని ఫైర్ ఎస్టిమిషన్‌తో మంటలను ఆర్పారు. అటుగా వెళ్తున్న క్రేన్ సహాయంతో వెంటనే కారును ముందుకు తీసుకెళ్ళి వదిలారు.ఈ సంఘటనతో అక్కడున్న వారు భయాందోళనకు గురయ్యారు. పెట్రోల్ బంకు సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు.

రూ.26 లక్షలు పట్టివేత

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ చౌరస్తా ఎన్ఐఆర్‌డీ కమాన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ద్విచక్ర వాహనంపై రూ.26 లక్షల రూపాయలు తీసుకెళ్తున్న బుద్వేల్ ప్రాంతానికి చెందిన రమేశ్ తనిఖీలో పట్టుబడ్డాడు. ఈ డబ్బుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో పంచనామా నిర్వహించి సీజ్ చేశారు. ఈ డబ్బులు ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ


హైదర్షాకోట్ ప్రభుత్వ పాఠశాలను సందర్శిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: గౌతమ్ మోడల్ స్కూల్, ఎస్ఎంపీ పాఠశాల, ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గండిపేట్ మండల పరిధిలో..

మణికొండ: గండిపేట మండల పరిధిలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలకు 2560 మంది విద్యార్థులకు 2548 మంది హాజరు కాగా, 12 మంది గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి రాంరెడ్డి తెలిపారు.

'విశ్వేశ్వర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి'


కొత్త సోల్కర్ రెడ్డి

రాజేంద్రనగర్: చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలుపించుకుందామని బీజేపీ పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ కొత్త సోల్కర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు ఒక్క తాను ముక్కలే అని.. ఆ పార్టీల నాయకులు ప్రజల పక్షాన నిలబడకుండా అధికారం ఎటు ఉంటే ఆ పార్టీ వైపు నడుస్తారని పేర్కొన్నారు. దేశం కోసం ధర్మం కోసం ప్రజల కోసం పోరాడే ఏకైక పార్టీ బీజేపీ అని, స్థానికుడైన విద్యావేత్త, అవినీతి మచ్చలేని మనిషి విశ్వేశ్వర్ రెడ్డిని గెలుపించుకొని పార్లమెంట్‌కు పంపించుకుందామని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

టీజీబీలో రుణ మేళా


గ్రామీణ బ్యాంకులో రుణాలు తీసుకునేందుకు వచ్చిన మహిళలు

బండ్లగూడ: బండ్లగూడలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో మంగళవారం రుణమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ వెంకటనాగేశ్వరరావు మాట్లాడుతూ ఒక్క రోజే గ్రూప్ మహిళలకు రూ. 50 లక్షలకుపైగా రుణాలు మంజూరు చేశామన్నారు. మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో మహిళలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్ నుంచి సింధుదుర్గ్‌కు విమాన సర్వీసులు


ప్రారంభిస్తున్న ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు, జీఎంఆర్ అధికారులు

శంషాబాద్: హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని సింధుదుర్గ్‌కు విమాన సర్వీసును ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు, జీఎంఆర్ అధికారులు మంగళవారం ప్రారంభించారు. ఫ్లై 91 ఎయిర్‌లైన్స్ తమ కొత్త సర్వీసులను ప్రతి మంగళ, ఆదివారాల్లో శంషాబాద్ విమానాశ్రయం నుంచి సింధుదుర్గ్‌కు నడపనున్నారు. అలాగే అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో ఇవే సర్వీసులుంటాయన్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు కూడా విమాన సర్వీసులను పెంచుతున్నట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మార్చి 23 ఆఖరు

రాయదుర్గం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్/జేసీ కళాశాల గౌలిదొడ్డి ప్రిన్సిపల్ ఏ శారద సూచించారు. రంగారెడ్డిజిల్లా గౌలిదొడ్డిలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో 9వ తరగతి రెగ్యులర్ ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశం కోసం ఈనెల మార్చి 23వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 21వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: మద్యం అమ్ముతున్న ముగ్గురుపై అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.... శివరాం పల్లి లో గత కొంతకాలంగా అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. పోలీసులు పలు ఇళ్లల్లో తనిఖీలు చేశారు. శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్ గౌడ్, లక్ష్మీ వేరువేరుగా మద్యం అమ్ముతున్నట్లు గుర్తించారు. వారి వద్ద తనిఖీలు నిర్వహించగా 30 లీటర్ల మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి తెలిపారు.